క్లుప్తంగా

అధికారులకు సత్కారం


మురళీకృష్ణ, వెంకటేశ్వరిని సత్కరిస్తున్న కలెక్టర్

అమలాపురం రూరల్: కలెక్టరేట్ కో–ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, అంబాజీపేట తాహసీల్దార్ వెంకటేశ్వరి అత్యుత్తమ సేవలందించారని జేసీ టి.నిషాంతి, డీఆర్‌ఓ బీఎస్‌ఎల్ రాజకుమారి ప్రశంసించారు. వారి పదవీ విరమణ సందర్భంగా కలెక్టరేట్‌లో శుక్రవారం రాత్రి వీడ్కోలు సభ నిర్వహించారు. కలెక్టర్ మహేష్‌కుమార్‌తో పాటు, కలెక్టరేట్ సిబ్బంది వారిని సత్కరించారు.

సురక్షితంగా గమ్యాలకు చేర్చాలి

అమలాపురం టౌన్: రోడ్డు ప్రమాదాల రహితంగా ఆటో డ్రైవింగ్, ఆటో ప్రయాణం ఉండాలని, ఆటో ఎక్కిన ప్రతి ప్రయాణికుడిని సురక్షితంగా గమ్యాలకు చేర్చాలని పట్టణ సీఐ పి.వీరబాబు ఆటో డ్రైవర్లతో అన్నారు. స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత తదితర అంశాలపై పట్టణ ట్రాఫిక్ ఎస్సై ఎం.ఏసుబాబు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి సీఐ వీరబాబు మాట్లాడుతూ, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని, రోడ్డు ప్రమాదాలకు కారణం కారాదని హితవు పలికారు. ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఓవర్ లోడ్‌తో వెళ్లే డ్రైవర్లపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఎస్సైలు టి.శ్రీనివాస్, రామశాస్త్రులు, కార్మిక శాఖ కార్యాలయ ప్రతినిధి లక్ష్మి, ఆటో సంఘ జిల్లా అధ్యక్షుడు వి.సత్తిరాజు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలను ప్రోత్సహించాలి

ముమ్మిడివరం: డ్వాక్రా సంఘాల మహిళలు ఇంటి వద్ద తయారుచేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి, వారిని ప్రోత్సహించాలని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ అన్నారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సోమాని భాస్కర్ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను ఆయన ప్రారంభించారు. మహిళలు స్వయం ఉపాధి కోసం బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని, స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను ఈ బజార్‌లో ప్రదర్శించడంతో పాటు, విక్రయానికి ఉంచారన్నారు. సీఓ రాజేశ్వరి, అన్ని వార్డుల రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

సాల్వెన్సీలు, డిపాజిట్లు లేకుండా లీజులా..?

- షాపుల సబ్ లీజులపై మరోసారి రగడ
- అధికారులను నిలదీసిన పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు
- రాజకీయ సిఫార్సులు, జోక్యం ఉండరాదని అభ్యంతరం
- రూ.80 లక్షల లీజు బకాయిలపై కౌన్సిల్ ఆందోళన


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, అధికారులు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలోని షాపింగ్ కాంప్లెక్స్‌ల్లోని షాపుల లీజు బకాయిలు, సబ్ లీజులు, సాల్వెన్సీలు, డిపాజిట్లు లేకుండా షాపులను లీజుకివ్వడం, ఫలితంగా మున్సిపాలిటీ ఆదాయం తగ్గుముఖం పట్టడం వంటి అంశాలపై కౌన్సిల్ సమావేశం ఆద్యంతం వాడీవేడిగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఆయా అంశాలపై అధికారులను ప్రశ్నల వర్షంతో ఉక్కిరిబిక్కిరి చేశారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, రెవెన్యూ అధికారి భూపతి శ్రీలక్ష్మి కౌన్సిల్‌కు ఇచ్చిన సమాధానాలపై కౌన్సిలర్లు సంతృప్తి చెందలేదు. వారి వైఫల్యం వల్లే మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోందని కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఏ షాపు లీజుదారుడైన మూడు నెలలకు మించి అద్దె బకాయిలుంటే, ఆ అంశాన్ని కౌన్సిల్ సమావేశం అజెండాలో చేర్చాలన్న నిబంధనను అనుసరించడం లేదని పాలకపక్ష కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులనాని ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దె బకాయిలున్న వారు.. తిరిగి షాపుల లీజు వేలంలో పాల్గొనరాదని, సాల్వెన్సీ సర్టిఫికెట్, మూడు నెలల అడ్వాన్సు డిపాజిట్‌గా తీసుకోవాలన్న జీవో 2011లోనే వచ్చినప్పటికీ, ఇప్పటిదాకా దానిని అమలులో పెట్టలేకపోయారని బులినాని మండిపడ్డారు. సర్క్యులర్ బజార్‌లో షాపులను లీజుకు తీసుకుని బ్యాంక్ నిర్వహిస్తున్న ఐసీఐసీఐ ఏకంగా రూ.11 లక్షల మేర అద్దె బకాయి ఉన్నా, ఇప్పటి దాకా ఎందుకు వసూలు చేయలేదని కౌన్సిలర్లు బొర్రా వెంకటేశ్వరరావు, యేడిద శ్రీను అధికారులను నిలదీశారు. అదే సామాన్యుడి షాపు లీజు బకాయి ఉంటే హడావుడి చేసే అధికారులు, ఓ బ్యాంక్ రూ.11 లక్షలు బకాయి ఉంటే అంత సీరియస్‌గా చర్యలు లేవేమిటని కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము ప్రశ్నించారు. సామాన్య లీజుదారునికి ఓ రూలు, బ్యాంక్‌కు ఓ రూలా...? అంటూ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. సాల్వెన్సీలు, డిపాజిట్లు లేకుండా షాపులు లీజుకు ఇస్తున్నారన్న కౌన్సిలర్ల ఆరోపణలపై కమిషనర్, రెవెన్యూ అధికారి స్పందిస్తూ, లీజులు ఆన్‌లైన్ కాకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తిందని వివరణ ఇచ్చినా, వారి సమాధానాలను కౌన్సిలర్లు పట్టించుకోలేదు. వారి నిర్లక్ష్యం, తగిన చర్యలు లేకపోవడం వల్లే షాపుల అద్దెల బకాయిలు దాదాపు రూ.80 లక్షల మేర పేరుకుపోయానని కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. సాల్వెన్సీల సమర్పణకు లీజుదారునికి ఆస్తులు ఉండాలని, ఒకవేళ ఆస్తులు లేకపోతే ఎంటీ చెక్కులు తీసుకోవాలని కౌన్సిలర్ నాగేంద్ర చెప్పారు. సాల్వెన్సీ, డిపాజిట్లు, చెక్కుల భయం లేకపోవడం వల్లే బకాయిలు పెరిగిపోతున్నా, వారిపై చర్యలు ఉండడం లేదన్నారు.

బ్యాంక్ బకాయిలపై నోటీసులు

రూ.11 లక్షల లీజు బకాయి పడిన ఐసీఐసీఐ బ్యాంక్ బ్రాంచికి నోటీసులు ఇచ్చామని కమిషనర్ రాజు సమావేశంలో తెలిపారు. ఈ రోజు వరకూ గడువు ఇచ్చామని, బకాయి చెల్లించకపోతే బ్యాంక్‌కు తాళాలు వేస్తామని స్పష్టం చేశారు. ఆ బ్యాంక్ వద్దకు కమిషనర్, రెవెన్యూ సిబ్బంది వెళ్లి, వారి కార్యకలాపాలను స్తంభింపచేసి, లీజు బకాయిలు చెల్లిస్తేనే కదులుతామని భీష్మిస్తే బకాయిలు వసూలు అవుతాయని కౌన్సిలర్లు ముకుమ్మడిగా అన్నారు. అవసరమైతే తాము కూడా వస్తామని తెలిపారు. అందుకు అధికారులు బ్యాంక్‌పై చర్యలకు వెళతామని బదులిచ్చారు.

షాపులకు లీజులు చెల్లించని, రూ.లక్షల్లో బకాయిలు పడ్డ లీజుదారులపై ఆర్ఆర్ యాక్ట్ ప్రయోగిస్తే మేలన్న అభిప్రాయాన్ని కౌన్సిలర్ బులినాని వ్యక్తం చేశారు. ఎన్ని షాపులు సబ్ లీజులకిచ్చి, మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారన్న విషయమై దృష్టి పెట్టలేకపోవడం కూడా అధికారుల వైఫల్యమేనన్నారు. దీనిపై కమిషనర్ రాజు స్పందిస్తూ, ఈ విషయమై కౌన్సిల్ ఓ విధాన నిర్ణయం తీసుకుంటే ఆర్ఆర్ యాక్ట్ అమలు, సబ్ లీజులపై చర్యలు వంటి విషయాలపై చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని స్పష్టం చేశారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ జిల్లా అధ్యక్షులకు సత్కారం


నంగవరంలో జున్నూరి వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న పార్టీ నాయకులు


సన్నవిల్లిలో గిరిజాకుమారిని సత్కరిస్తున్న సర్పంచులు, ఇతర నేతలు

ఉప్పలగుప్తం: ఇటీవల వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా నియమితులైన నంగవరం సర్పంచ్ జున్నూరి వెంకటేశ్వరరావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన సన్నవిల్లి, నంగవరం ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజా కుమారిని పార్టీ నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు.

సత్కరించిన వారిలో సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, చినగాడవిల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు కామిశెట్టి ఏసు, పోలమాటి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

వేసవిలో తాగు నీటి సరఫరాకు ప్రణాళిక

జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు


గుండెపూడిలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న సీఈఓ

అల్లవరం: వేసవిలో బోడసకుర్రు, గుండెపూడి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టుల ద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించడానికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మణరావు తెలిపారు. బోడసకుర్రు, గుండెపూడి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టులను శుక్రవారం ఆయన పరిశీలించారు. బోడసకుర్రు ప్రాజెక్టు ద్వారా ఎన్ని గ్రామాలకు నీరు సరఫరా అవుతుందని అధికారులను ఆరా తీశారు. 35 కి.మీ. పొడవునా 13 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందని ఇన్‌చార్జి డీఈ రాంప్రసాద్ తెలిపారు. ఈ ప్రాజెక్టుకు 15 హెచ్‌పీ మోటార్, ట్రాన్స్‌ఫార్మర్ అవసరమని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి తెలిపారు. జెడ్పీ నుంచి రూ.6 లక్షలు, మండల పరిషత్, పంచాయతీల నుంచి మరో రూ.6 లక్షలతో వీటిని సమకూర్చేలా ప్రతిపాదనలు ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సీఈఓ సూచించారు. బోడసకుర్రు ప్రాజెక్టు నుంచి తాగునీరు పరిశుభ్రంగా ఉండడం లేదని, నీటిలో తోక పురుగులు వస్తున్నాయని సీఈఓ దృష్టికి సర్పంచ్ తీసుకొచ్చారు. ఆయన స్పందిస్తూ, ఇక ముందు అలా జరగడానికి వీల్లేదని సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం మధ్యాహ్నం గుండెపూడిలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించి, సిబ్బంది నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ చుట్టూ చెట్లు పెరిగిపోవడంతో, ట్యాంక్ నిర్వహణ ఇలా చేస్తారా అని సిబ్బందిని నిలదీశారు. స్టోరేజ్ ట్యాంక్ గట్లు జారిపడి, పూర్తి స్థాయిలో నీరు నిల్వ చేయడానికి అవకాశం లేదని, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పునర్నిర్మించాల్సి ఉందని సీఈఓకి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. సీఈఓ స్పందిస్తూ రెండు ప్రాజెక్టుల్లో నిర్వహణ లోపాలు, కరెంట్ సమస్యలున్నాయని, వాటిని అధిగమించాల్సి ఉందన్నారు. తొలుత బోడసకుర్రు సచివాలయాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన వెంట ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ఎంపీడీఓ కృష్ణప్రసాద్, ఏఈ స్వామి తదితరులు ఉన్నారు.

ఎంపీడీఓ తీరుపై అసహనం

గుండెపూడి ప్రాజెక్టు పనితీరుపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సీఈఓ చర్చిస్తున్న సమయంలో, ఎంపీడీఓ కృష్ణప్రసాద్ గుండెపూడి సచివాలయం సిబ్బందిని పరిచయం చేసేందుకు యత్నించారు. దీంతో సీఈఓ అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ అయి ఉండి, ఈ సమయంలో పరిచయాలేమిటని, ఎప్పుడు పరిచయాలు చేసుకోవాలో తెలియదా అని ప్రశ్నించారు. సీఈఓ మాటలకు ఎంపీడీఓ కంగుతిన్నారు.

ఆలయంలో 8 కిలోల వెండి అపహరణ


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శేఖర్‌బాబు

అమలాపురం రూరల్: సవరప్పాలెం గ్రామ రమా సత్యనారాయణ ఆలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్వామివారి, అమ్మవార్ల మెడలోని 8 కేజీల వెండి అభరణాలను దొంగలు అపహరించారు. పోలీసుల వివరాల మేరకు, సవరప్పాలెం మెయిన్ రోడ్డులో రమా సత్యనారాయణ ఆలయంలో దొంతుకుర్తి శ్రీనివాస్ పూజారిగా ఉన్నారు. గురువారం సాయంత్రం పూజల అనంతరం గుడికి తాళాలు వేశారు. శుక్రవారం తెల్లవారుజామున ఆలయానికి వచ్చేసరికి, గుడి గేటు, తాళాలు పగులగొట్టి, తలుపులు పెకిలించినట్టు ఆయన గుర్తించారు. ఆలయంలో వెండి వస్తువులు కనిపించకపోవడంతో, ఈ విషయాన్ని ఆలయ కమిటీ వారికి, గ్రామస్తులకు తెలిపారు. సమాచారం అందుకున్న తాలూకా ఎస్సై శేఖర్‌బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ఆధారాలు సేకరించాయి. క్రైమ్ పార్టీ సీఐ గజేంద్రకుమార్, పట్టణ సీఐ వీరబాబు సంఘటన స్థలానికి వచ్చారు. డాగ్ స్క్వాడ్‌తో దొంగల కోసం గాలింపు చేపట్టారు. శ్మశాన వాటిక వరకు వెళ్లి జాగిలాలు ఆగాయి. పోలీసులకు అక్కడ మద్యం బాటిళ్లు కనిపించాయి. అక్కడి నుంచి జాగిలం ఓ ఇంటి వద్ద ఆగింది. దాంతో పోలీసులు ఆ ఇంటి వ్యక్తుల వేలిముద్రలు సేకరించారు. ఆలయంలో 8 కేజీల వెండి చోరీకి గురైనట్లు పోలీసులు గుర్తించారు. పూజారి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని యువకుడికి గాయాలు

ముమ్మిడివరం: మోటారు సైకిల్‌పై వెళ్తున్న యువకుడిని ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ముమ్మిడివరం మండలం అయినాపురానికి చెందిన ఇళ్ల సూర్యవెంకట నాగమల్లేశ్వరరావు మామిడికుదురు జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం మోటారు సైకిల్‌పై అతను తన ఇంటికి తిరిగి వస్తుండగా బొండాయి కోడు తూము వద్ద ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నాగమల్లేశ్వరరావును ఢీకొట్టిన డ్రైవర్ ఆటోతో పరారు కాగా, చివరికి అతనిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూట్యూబర్ చర్యతో స్టేడియంలో గోతులు

అమలాపురం రూరల్: వ్యూస్ కోసం కొందరు యూట్యూబర్లు విచక్షణను వదిలేస్తున్నారు. అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియం గ్రౌండ్‌ను ఓ యూట్యూబర్ అనుచరులు గోతులమయం చేశారు. ఈ చేష్టలను జిల్లా క్రీడాఅభివృద్ధి అధికారి అడ్డుకోవడంతో అక్కడి నుంచి పారిపోయారు. సుమారు 300 మందిని వెంటబెట్టుకుని ఓ యూట్యూబర్ బాలయోగి స్టేడియం గ్రౌండ్‌లోకి ప్రవేశించాడు. ఈ గ్రౌండ్‌లో బంగారం పాతిపెట్టానని, అది ఎవరికి దొరికితే వారిదే అంటూ అక్కడ వచ్చిన యువకులను ఉసిగొల్పాడు. దాంతో వారు చేతికి దొరికిన వస్తువుతో గ్రౌండ్‌ను తవ్వడం మొదలెట్టారు. దీనిని గమనించిన జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సురేష్‌కుమార్ వారి చర్యలను నిలుపుదల చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


కొమరగిరిపట్నంలో రామన్ చిత్రపటం వద్ద విద్యార్థులు

ముమ్మిడివరం: మండలంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.ఎస్.ప్రభాకర్ ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. పలు పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు, సైన్సు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కే.చిట్టిబాబు, ఎస్.తులసి, తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం వెంకటరమణ ఆధ్వర్యంలో విద్యార్థులు ముగ్గు, గులక రాళ్లు, బొగ్గుతో రామన్ చిత్రపటాన్ని ప్రదర్శించారు.

అమలాపురం రూరల్: వన్నెచింతలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వివిధ సైన్స్ పరికరాలను ప్రదర్శించారు. ఉత్తమ పరికరాలకు హెచ్‌ఎం జి.నాగ సత్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

తాళ్లరేవు: సుంకరపాలెంలోని నల్లం రెసిడెన్షియల్ హైస్కూల్‌లో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సైన్స్ అండ్ మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌ను ఎంఈఓ ఏ.మంగాయమ్మ ప్రారంభించారు. చిన్నారులు వివిధ రకాల పండ్లు, కాయగూరల వేషధారణలతో ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. సుమారు 500 మంది 200కు పైగా ఎగ్జిబిట్లను ప్రదర్శించారు.

మత్స్యకారులకు అవగాహన

ఐ పోలవరం: వేట సమయంలో వలల్లో చిక్కుకుపోయిన సముద్ర తాబేళ్లు తప్పించుకునేలా ఉపకరించే టెడ్స్ అనే పరికరం వినియోగంపై శుక్రవారం భైరవపాలెంలో సోనాబోట్ యజమానులకు, కలాశీలకు అవగాహన కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన ఎస్ఎఫ్‌డీబీ ప్రతినిధి కె.భార్గవి, శాస్త్రవేత్త డాక్టర్ రఘు ప్రకాష్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. 85 తాబేళ్లు తప్పించుకునే పరికరాలను అందజేశారు.

నేటి నుంచి నూతన మోటార్ చట్టం అమలు

అమలాపురం టౌన్: కేంద్ర నూతన మోటారు వాహనాల చట్టం శనివారం నుంచి అమలులోకి వస్తుందని ఎస్పీ బి.కృష్ణారావు వెల్లడించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే జరిమానా, జైలు శిక్షలు వంటివి ఉంటాయని తెలిపారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే రూ.5 వేల వరకూ జరిమానా, మాదక ద్రవ్యాలు సేవించి వాహనం నడిపితే రూ.10 వేలు, 6 నెలల జైలు, హెల్మెట్ లేకుండా, సీటుబెల్టు పెట్టుకోకపోతే రూ.వెయ్యి, మైనర్లు వాహనాలు నడిపితే రూ.5 వేలు, నిర్లక్ష్యంగా వాహనం నడిపితే మొదటిసారి రూ.1,500, రెండోసారి రూ.10 వేలు, భారీ వాహనాలకు మొదటిసారి రూ.2 వేలు, రెండోసారి రూ.10 వేలు, మూడేళ్ల జైలు, రిజిస్ట్రేషన్ లేని వాహనాలకు మొదటిసారి రూ.2 వేలు, తదుపరి రూ.5 వేలు, భారీ వాహనాలకు తొలిసారి రూ.5 వేలు, తదుపరి రూ.10 వేలు, నంబర్ ప్లేట్ లేకపోతే మొదటిసారి రూ.300, తదుపరి రూ.750, భారీ వాహనాలకు మొదటిసారి రూ.600, తదుపరి రూ.1,500, ఇన్సూరెన్స్ లేకపోతే తొలిసారి రూ.2 వేలు, తదుపరి రూ.4 వేలు. భారీ వాహనాలకూ అదే స్థాయి జరిమానాలు విధిస్తారని తెలిపారు.

పీఆర్సీ అమలుకు కేటాయింపులేవి...?

రాష్ట్ర బడ్జెట్‌పై ఎస్టీయూ అసంతృప్తి

అమలాపురం టౌన్: గతం నుంచి అమలు చేయాల్సిన 12వ పీఆర్సీ ఇప్పటికే కొన్ని నెలలపాటు జాప్యం జరిగినప్పటికీ అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దాని అమలుకు నిధుల కేటాయింపుపై స్పష్టత లేదని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్య పల్లంరాజు ఓ ప్రకటనలో అసంతృప్తి వ్యక్తం చేశారు. సీపీఎస్, జీపీఎస్ కంటే మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీపై బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటన లేనందుకు నిరుత్సాహంగా ఉందన్నారు. అలాగే పాఠశాల విద్యకు గత సంవత్సరం 10.15 శాతం నిధులు కేటాయించగా ప్రస్తుతం 9.86 శాతం మాత్రమే నిధులు ఇచ్చారన్నారు. విద్యా రంగాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటించినట్లుగా బడ్జెట్‌లో ఆ రంగానికి తగిన నిధులు కేటాయించలేదన్నారు.

ఘనంగా టైలర్ల దినోత్సవం


అమలాపురంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న తాతాజీ, అరుణకుమారి తదితరులు


అమలాపురంలో సీనియర్ టైలర్ రామలింగేశ్వరరావును సత్కరిస్తున్న వ్యాపార ప్రతినిధులు


కాట్రేనికోనలో టైలర్స్ డే నిర్వహిస్తున్న దర్జీలు

అమలాపురం టౌన్: కష్టాల్లో ఉన్న ఓ దర్జీ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడంలోనే నిజమైన టైలర్స్ డే జరుపుకొన్నట్లు అవుతుందని పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ అన్నారు. ది అమలాపురం టౌన్ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ముస్లిం స్ట్రీట్‌లో శుక్రవారం జరిగిన టైలర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇటీవల సంఘ సభ్యుడు కొప్పిశెట్టి సుబ్రహ్మణ్యం మృతి చెందడంతో, ఆయన కుటుంబానికి సంఘపరంగా రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. మరో ముఖ్యఅతిథి కామనగరువు సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు ఎస్.అరుణకుమారి వారిని అభినందించారు. కార్యక్రమానికి టైలర్ల సంఘ అధ్యక్షుడు కొప్పిశెట్టి మోహనరావు అధ్యక్షత వహించారు. తొలుత టైలర్స్ డే జెండాను టైలర్, అలనాటి లవకుశ చిత్రం కుశుడు పాత్రధారి వియ్యూరి నాగసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. కుట్టు మెషీన్ సృష్టికర్త విలియమ్స్ హోవే చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘ ప్రతినిధులు కొమానపల్లి శ్రీనివాసరావు, వెన్నా వెంకటరమణ, విత్తనాల బుల్లియ్య, డి.శివప్రసాద్, ఎస్.గంగాధరరావు పాల్గొన్నారు.

సీనియర్ టైలర్‌కు సత్కారం

నాలుగు దశాబ్దాల పాటు సేవలందించిన సీనియర్ టైలర్, ది అమలాపురం టైలర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చింతా రామలింగేశ్వరరావును టైలర్స్ డే సందర్భంగా పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన వ్యాపార ప్రతినిధులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. స్థానిక సంఘ భవనంలో చాంబర్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ అధ్యక్షతన సత్కార సభ జరిగింది. చాంబర్ ప్రతినిధులు కంచిపల్లి అబ్బులు, కొమ్మూరి వెంకటాచలప్రసాద్, దొమ్మేటి సాయిబాబు, మోకా వెంకటసుబ్బారావు, టైలర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వాకాడ భాస్కరరావు, దొడ్డా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాట్రేనికోన: నవోదయ అభ్యుదయ టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం విలియమ్స్ హోవే జయంతిని స్థానిక గేటు సెంటర్‌లో నిర్వహించారు. కాట్రేనికోన మావుళ్ల ఆలయం సమీపంలో సంఘ మండల అధ్యక్షుడు విత్తనాల వెంకటవరప్రసాద్ ఆధ్వర్యంలో విలియమ్స్ హో చిత్రపటానికి నివాళులర్పించారు. 50 ఏళ్లు నిండిన టైలర్లకు ప్రభుత్వం పింఛను మంజూరు చేయాలని కోరారు. ఆలయం నుంచి గేటు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

టైలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

యానాం: నియోజకవర్గ పరిధిలో టైలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్ఏఓ మునిస్వామి అన్నారు. శుక్రవారం కుట్టుమెషీన్ సృష్టికర్త విలియమ్స్ హోవే జయంతి సందర్భంగా శ్రీవిఘ్నేశ్వరా టైలర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో టైలర్స్ డే జరిగింది. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వపరంగా టైలర్ల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు ప్రముఖులను సత్కరించారు. టైలర్స్ సంఘానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ రూ.2.25 లక్షల ఆర్థిక సాయం అందించారు.

అల్లవరం: దేవగుప్తంలో సిద్ధి వినాయక టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో విలియం హోవే చిత్రపటానికి సంఘ అధ్యక్షులు గుబ్బల నాగేశ్వరరావు నివాళులర్పించారు. బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి విలియం హోవే చిత్రపటానికి పూలమాల వేశారు.